క్లుప్తంగా

9 మందికి 'కల్యాణమస్తు'

యాడికి: వైఎస్సార్ కల్యాణమస్తు పథకానికి మండలంలో 9 మంది ఎంపికైనట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చందన సచివాలయంలో ఒకరు, యాడికి నం:5 ఒకరు, లక్షుంపల్లె ఒకరు, రాయలచెరువు ఒకరు, యాడికి నం:4లో ముగ్గురు, యాడికి నం–2లో ఒకరు, కమల పాడు సచివాలయంలో ఒకరు చొప్పున కల్యాణ మస్తు, షాదీ తోఫాకు ఎంపికయ్యార న్నారు. వీరందరికీ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలలో కులాంతర వివాహానికి రూ 1.20 లక్షలు, బీసీలు రూ 50 వేలు, బీసీ కులాంతర వివాహానికి రూ.75 వేలు, మైనారిటీ వివాహానికి రూ.లక్ష, దివ్యాంగుల వివాహానికి రూ.1.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికుల వివాహానికి రూ.40 వేలు ప్రభుత్వం ప్రోత్సాహక నగదు ఇస్తున్నట్లు ఎంపీడీఓ వివరించారు.

ఫ్లెక్సీల తొలగింపు

గుత్తి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను శనివారం మున్సిపల్ అధికారులు సిబ్బంది చేత తొలగించారు. ఎన్టీఆర్, వైఎస్సార్ విగ్రహాలకు ముసుగు వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఆయా పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించామని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర చెప్పారు.

దేవరకొండపై ప్రత్యేక పూజలు



అలంకరణలో కొండమీద రాయుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో సిద్దరాంపురం రోడ్డు సమీపాన ఉన్న దేవరకొండపై కొండమీద రాయుని ఆలయంలో స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

13 నుంచి సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన

గుంతకల్లు రూరల్: సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించనున్నట్లు సీపీఐ అనుబంధ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీ.గోవిందు పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పనితీరు, మరమ్మతులు, నిధుల వినియోగం, డిస్ట్రిబ్యూటరీల పనితీరు తదితర వివరాలను పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తామన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి ఇతర నాయకులు పాల్గొన్నారు.

దంపతులకు స్వల్పగాయాలు

పెద్దపప్పూరు: ఇంటిలోని వస్తువులను చక్కబెడుతున్న తరుణంలో ప్రమాదవశాస్తు పెట్రోల్ బాటిల్‌కు నిప్పంటుకుని దంపతులకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. అమ్మలదిన్నె గ్రామంలో శుక్రవారం సూర్యనారాయణ, ఉషా దంపతులు మరొక ఇంటికి తరలివెళ్లాలని ఇంటిలోని సామగ్రిని చక్కబెడుతున్న తరుణంలో సూర్యనారాయణ బీడీతాగాలని అగ్గిపెట్టె వెలిగించడంతో పక్కనే ఉన్న పెట్రోల్ బాటిల్‌కు నిప్పు సెగ తగలడంతో ఒక్కసారిగా మంటలు లేచాయి. ఘటనలో దంపతులు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వారిని తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేడు రాతిదూలం పోటీలు

గార్లదిన్నె: కల్లూరులోసింగరప్ప తిరునాల్లో భాగంగా ఆదివారం గ్రామ పంచాయతీ ప్రజల ఆధ్వర్యంలో న్యూ కేటగిరీ విభాగం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు రూ.500 ప్రవేశరుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందిస్తామన్నారు. వివరాలకు 9014399414, 9866149433, 9908763983 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హైకోర్టు జడ్జికి సన్మానం



జస్టిస్ గంగారావ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావ్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శివరావ్, కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ గుంతకల్లుకు చెందిన జడ్జి గంగారావ్ హైకోర్టు న్యాయమూర్తిగా ఎదగడం గర్వకారణమన్నారు. కోశాధికారి సురేష్, న్యాయవాదులు నాగరాజు, లక్ష్మీనారాయణ ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక గాజి దర్గా

- 18 నుంచి 20 వరకు ఉరుసు
- ఏర్పాట్లు చేస్తున్న దర్గా కమిటీ సభ్యులు

శింగనమల: నియోజకవర్గ కేంద్రంలో హజరత్ సయ్యద్ సాలర్ మసూద్ గాజి దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. మసూద్ గాజి అజ్మీరి రహ్మతుల్లా అలైహి ఉరుసు మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహించడానికి దర్గా కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. వేడుకలను దర్గా ముతవల్లి అబ్దుల్ రవూఫ్, దర్గా ముజావర్లు అక్రం రజాక్, అల్లాబకాష్, సర్పంచ్ నాగమునెమ్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నారు.

మసూద్ గాజి దర్గా ప్రత్యేకత:

శింగనమలలో హిందూ–ముస్లింల ఇంట ఏ శుభ కార్యం జరిగిన మొదట దర్గాకు వెళ్లి చక్కెర చదివింపులు చేయిస్తారు. దీనితో పాటు ప్రతి గురువారం దర్గాకు వెళ్లి చక్కెర చదివింపులు చేయించడం ఆనవాయితీ. కొందరు మానసిక అనారోగ్యంతో ఉన్న వారు ఇక్కడే కొద్ది రోజులు ఉంటే బాగవుందని నమ్మకం. చాలా మంది ఇక్కడే ఉండి సేవ చేసుకుంటున్నారు.

18న గంధం

ఈనెల 18 నుంచి 20 వరకు ఉరుసు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు గంధం కార్యక్రమం జరగనుంది. అదే రోజు రాత్రి 8 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుంది. రాత్రి 9.30 గంటల నుంచి 1 గంట వరకు దర్గాలో పూల చాందిని తయారు చేస్తారు. పూల చాందినిని అలంకరించిన తర్వాత తెల్లవారుజామున 1.30 గంటలకు పూల చాందిని(గంధం)ని పురవీధుల్లో ఊరేగించనున్నారు. పకీర్ల జల్సాలు, కర్రసాము విన్యాసాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపు సాగనుంది. ఉదయం 6 గంటలకు పూలచాందిని దర్గాకు చేరుకుంటుంది. అక్కడ చదివింపులు తరువాత భక్తులు మొక్కులు చెల్లిస్తారు.



మసూద్ గాజి సమాధి

19న ఉరుసు

ఈనెల 19న ఉరుసు కార్యక్రమం నిర్వహిస్తారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు. భక్తులు మొక్కుబడులు చెల్లిస్తారు. తర్వాత కందురోత్సవ ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం ఇరుసు ఎత్తు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు అందించనున్నారు. రాత్రి ఖవ్వాలి పోటీలు నిర్వహించనున్నారు. 20వ తేది జియారత్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆరోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. రాత్రి జాలీ బ్రదర్స్ వారిచే ఆర్కెస్ట్రా తెలుగు, హిందీ పాటల కచేరి నిర్వహించనున్నారు. ఉరుసుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరుకానున్నారు. ఆదే విధంగా శింగనమల , అనంతపురం, తాడిపత్రి, పామిడి, కల్లూరు, గుంతకల్లు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపడుతున్నట్లు సీఐ అస్రార్ బాషా, ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పులగుట్టపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కేసీ భాస్కర్ 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకున్న వీరు వారి ఇళ్లకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి శనివారం వారి ఇళ్లకు చేరుకుని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. నాయకులు దశరథరెడ్డి, జెడ్పీటీసీ కదిరప్ప ఉన్నారు.



చంద్రను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

చింతలరాయుడి సన్నిధిలో ఆర్మీ అధికారులు

తాడిపత్రి టౌన్: స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయాన్ని శనివారం పశ్చిమబెంగాల్‌కు చెందిన జూట్ రెజిమెంట్ అధికారి కల్నల్ జేడీ చౌదరి, పంజాబ్ చెందిన ఆర్మీ మెడికల్ రెజిమెంట్ కల్నల్ రవికుమార్ సందర్శించారు. అనంతరం అమ్మవారు, చింతల రాయుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో శిల్ప సంపదను వారు తిలకించారు. ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయంలో శిల్ప సంపదను తిలకిస్తున్న ఆర్మీ అధికారులు

యశ్వంత్ బాబుపై కేసు నమోదు చేయాలి

గుత్తి: చెట్నేపల్లికి చెందిన ఓ యువతిని గుత్తి ఆర్ఎస్‌కు చెందిన యశ్వంత్ బాబు అనే యువకుడు ప్రేమించి పెళ్లి మాట ఎత్తేసరికి ముఖం చాటేశాడని అతనిపై చీటింగ్ కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో శనివారం యువతి కుటుంబ సభ్యులు, బంధువులు, చెట్నేపల్లి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. చెట్నేపల్లికి చెందిన మస్తానప్ప, వెంకటేష్, ఆంజనేయులు, నారాయణ, రమణ, నాగరాజు, సుందర రాజ్, మహిళా సంఘం సభ్యులు సునీత, మాబున్ని మాట్లాడుతూ యువతిని మాయమాటలు చెప్పి మోసం చేసిన యశ్వంత్‌బాబును అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా యువకుని చేతిలో మోసపోయిన యువతి మాట్లాడుతూ యశ్వంత్ బాబు తనను ఆరేళ్లపాటు ప్రేమించాడన్నారు. అయితే పెళ్లి మాట ఎత్తేసరికి ముఖం చాటేశాడన్నారు. తనను మోసం చేసిన యశ్వంత్ బాబుపై ఐదు రోజుల క్రితమే పోలీసుల కు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు.



రాస్తారోకో చేస్తున్న చెట్నేపల్లి గ్రామస్తులు

ముగిసిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు శనివారం ముగిసాయి. పోటీల్లో కర్నూలు, వైఎస్సార్, ఎన్టీఆర్ జిల్లాల వృషభాలు పాల్గొన్నాయి. సీనియర్ విభాగంలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటుపల్లికి చెందిన చంద్ర ఓబుళరెడ్డి వృషభాలు ప్రథమ, వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లికి చెందిన శివరామిరెడ్డి వృషబాలు ద్వితీయ, నంద్యాల జిల్లా పీఆర్.పల్లికి చెందిన నాగయ్య వృషభాలు తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. రెండు పళ్ల విభాగంలో వైఎస్సార్ కడప జిల్లా బొగాలకట్ట గ్రామానికి చెందిన రామయ్య వృషభాలు మొదటి స్థానం, కర్నూలు జిల్లా బాయపల్లికి చెందిన రామలక్ష్మణుడు వృషభాలు ద్వితీయ, బాపట్ల మండలం మార్టురుకు చెందిన కౌశిక్ చౌదరి వృషభాలు మూడవ స్థానంలో నిలిచాయి. ఆరు పళ్ల విభాగంలో అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం చాగల్లు ఆదినారాయణ వృషభాలు మొదటి, వైఎస్సార్ కడప జిల్లా ఖాదర్ కొట్టాలకు చెందిన లక్ష్మినరసింహ వృషభాలు ద్వితీయ, వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలం గొల్లపల్లికి చెందిన శివమేఘనరెడ్డి వృషభాలు మూడో స్థానంలో నిలిచాయి.



పోటీల్లో దూలం లాగుతున్న వృషభాలు

న్యూ కేటగిరి విభాగం విజేతలు

న్యూ కేటగిరి విభాగంలో నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన కేశవరెడ్డి వృషభాలు మొదటి, అనంతపురం జిల్లా గుత్తి మండలం వన్నేదొడ్డికి చెందిన బేడల వెంకట్రాముడు వృషభాలు ద్వితీయ, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్.పల్లికి చెందిన శివకోటి వృషభాలు మూడవ స్థానంలో నిలిచాయి. అనంతరం నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్ యాదవ్, పురుషోత్తం యాదవ్ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. తర్వాత దాతలను ఘనంగా సత్కరించారు.

మెగా లోక్ అదాలత్‌లో 725 కేసుల పరిష్కారం

గుత్తి: పట్టణంలోని ఏడీజే, జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో శనివారం మండల న్యాయసేవా సమితి, ఆరో అదనపు జిల్లా జడ్జి కబర్ది నేతృత్వంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 725 కేసులను పరిష్కారం చేసి, బాధితులకు రూ. 4,21,726 నష్ట పరిహారం ఇచ్చేలా తీర్పు వెలువరించారు. ఇందులో 108 ఐపీసీ కేసులు, 13 ఎంవీఐ, 575 డ్రంకెన్ డ్రైవ్, వాల్గా యాక్ట్ కేసు ఉన్నాయి. జేఎఫ్‌సీఎం విజయకుమార్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్‌బాబు, సభ్యులు రవీంద్ర బాబు, సుదర్శన్ రావు, సోమశేఖర్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా జూనియర్ సివిల్ జడ్జి ఈ.ప్రతిభ ఆధ్వర్యంలో 674 కేసులను పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఇందులో జేసీజే కోర్టుకు సంబంధించి 47 కేసులు, రైల్వే కోర్టు 21, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సంబంధించి 606 కేసులు ఉన్నాయి. సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆదిలింగయ్య, లోక్ అదాలత్ సభ్యులు చెన్నకేశవులు, బడేసాబ్, ఏపీపీ హేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూనస్ అహమ్మద్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ జిపి.తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న ఏడీజే కబర్ది

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

బుక్కరాయసముద్రం: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ మోహన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల నిర్వహణ కోసం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఉపాధ్యాయ ఓటర్లు 83 మంది, పట్టభద్రులు 1624 మంది ఉన్నారన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రదర్శిస్తామని, ఇంకా ఓటరుగా నమోదు చేసుకునేవారు సంప్రదించాలని సూచించారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

తాడిపత్రి టౌన్: కడప రోడ్డులోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో చతర్థశ వార్షికోత్సవాలు శనివారం ముగిశాయి. గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతి పీఠం ప్రకాశనంద స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.



భక్తులకు ఉపదేశిస్తున్న ప్రకాశనంద

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

తాడిపత్రి అర్బన్: లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి సుజన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి సుజన్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాల్లో కేసులు పేరుకుపోవడం వల్ల పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు. కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 287 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా మౌలాలి స్వామి ఉరుసు

గుత్తి రూరల్: ఊటకల్లు గ్రామంలో మౌలాలి స్వామి ఉరుసు శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మౌలాలి స్వామిని రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కొండపై నుంచి మౌలాలి స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోకి తెచ్చి ఫకీర్లు మేళతాళాలతో గుర్రంపై ఉంచి ఊరేగించారు. దర్గాలో ముజావర్లు స్వామికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు స్వామికి ఫాతెహాలు సమర్పించారు. గ్రామంలోని వీధులు ప్రజలతో కిటకిటలాడాయి. గ్రామంలో ఆట వస్తువులు విక్రయించే అంగళ్లు వెలిశాయి. జియారత్‌తో ఉరుసు ముగుస్తుందని గ్రామపెద్దలు తెలిపారు.

వితంతువులకు ఆర్థికసాయం

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో శనివారం 40 మంది పేద ఆర్యవైశ్య పేద వితంతువులకు ఒక్కొక్కరికి రూ.300 చొప్పున వాసవీక్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, క్లబ్ ఇంటర్ నేషనల్ మల్టీపుల్ వైస్ ప్రసిడెంట్స్ భూమా సూర్యనారాయణ, శేషాఫణి, కో ఆర్డినేటర్ సుబ్బరామయ్య, రీజనల్ చైర్మన్ సత్యనారాయణ, డైరక్టర్స్, క్లబ్ సెక్రటరీ చంద్రమౌళి, కోశాధికారి సుబ్బరత్నయ్య తదితరులు పాల్గొన్నారు.



వితంతువులకు నగదు అందిస్తున్న దృశ్యం

శుభకార్యం

పామిడి: పట్టణంలోని కోగటం ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి కుమార్తె సాత్వికకు యశ్వంత్‌రెడ్డితో వివాహం జరిగింది. ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనేత భీమిరెడ్డి, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ వీరాంజనేయులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, సచివాలయ పట్టణ, రూరల్ కన్వీనర్లు బీ ఆసిఫ్, ఎం కుమార్‌రెడ్డి, జోజోడే కుమార్, రాజశేఖర్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి రమణారెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపీపీ కాయల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

పంట కోత ప్రయోగాలు

పెద్దపప్పూరు: అమ్మలదిన్నె గ్రామంలో శనివారం జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్ సమక్షంలో వ్యవసాయాధికారులు పప్పుశనగలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. రైతు నారాయణ స్వామికి చెందిన సర్వేనంబర్ 534లో నిర్ణీత విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా 2.160 కేజీల దిగుబడి వచ్చింది. వ్యవసాయాధికారి ఆంజనేయులు, ఏఈఓ గంగులయ్య, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న సిబ్బంది

సుబ్రహ్మణ్యేశ్వరుడి గ్రామోత్సవం



పల్లకీపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామికి ఏకవార రుద్రాభిషేకం, సహ స్రనామార్చన వంటి కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు రామాచార్యులు నిర్వహించారు. స్వామి నివాస గ్రామమైన కోటంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెండి విగ్రహాలను రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించిన పల్లకీలో ఉంచి, గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు భజనలు, మేళతాళాల మధ్య స్వామిని ఆయన సన్నిధికి చేర్చారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గ్రామోత్సవాన్ని తిలకించారు. అనంతరం కొండల్లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఈఓ బాబు, ఎస్‌ఐ సాగర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: బాచుపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ శనివారం ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలిలు.. గ్రామానికి చెందిన రామేశ్వరి కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో పలు ఆసుపత్రులతో చికిత్స చేయించుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. మనస్తాపం చెందిన రామేశ్వరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బ్లీచింగ్ పౌడర్ నీళ్లలో కలుపుకొని తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతరాష్ట్ర దొంగ అరెస్ట్

రాయచోటి: వాహనాల టైర్లు, కాపర్ వైండింగ్ బాక్సులు అపహించుకెళ్లే అంతరాష్ట్ర దొంగను అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఆ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శనివారం వెల్లడించారు. కడపలోని అంగడివీధికి చెందిన వెంకటరమణ కుమారుడు గుజ్జల ధనకుమార్ ప్రస్తుతం తాడిపత్రిలోని యల్లనూరు యల్లనూరు రోడ్డు బిందెల కాలనీలో నివాసముంటున్నాడు. ఇతను పాత నేరస్తుడు. బళ్లారి, శ్రీసత్యసాయి, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలు రకాల చోరీలు చేశాడు. గతేడాది నవంబర్ 3న మొలకలచెరువు రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఎలక్ట్రికల్ షోరూం షట్టర్‌ను బ్రేక్ చేసి రూ.2.25 లక్షలు విలువ చేసే 25 కాపర్ వైండింగ్ బాక్సులను అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన సీఐ సాదిక్ వలి... పాత నేరస్తుల జాబితా సేకరించి, పక్కా ఆధారాలతో ధనకుమార్‌పై నిఘా పెంచారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నేరం తానే చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో ధనకుమార్‌పై కేసు నమోదు చేసి, టైర్లు, వైండింగ్ వైర్లతోపాటు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పుట్లూరు: దోశలేడు గ్రామంలో శనివారం అంకె రామాంజినేయులు (56)అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రామాంజినేయులు తనకున్న ఎనిమిది ఎకరాల్లో మొక్కజొన్న, పప్పుశనగ, ధనియాలు సాగు చేసేవాడు. గత కొన్నేళ్లుగా పంట నష్టంతో అప్పులు తిరిగి చెల్లించలేక ఆందోళనకు గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నాగలక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

పంట ఎత్తుకెళ్లిన వారిపై కేసు నమోదు

పుట్లూరు: అప్పు తిరిగి చెల్లించలేదని తన పొలంలో పప్పుశనగ దిగుబడిని దౌర్జన్యంగా ఎత్తుకెళ్లారని ఈ నెల 9న మడ్డిపల్లి గ్రామానికి చెందిన నారపరెడ్డి అనే రైతు పోలీసులకు పిర్యాదు చేసిన విషయం విదితమే. బాధిత రైతు పిర్యాదు మేరకు ముచ్చుకోట గోవర్ధనరెడ్డి, మడ్డిపల్లి జగదీశ్వరరెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

వృద్ధురాలి దుర్మరణం

తాడిపత్రి: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామానికి చెందిన సావిత్రి (70)కి అయిన వారు ఎవరూ లేరు. దీంతో బంధువుల వద్ద ఆశ్రయం పొందుతోంది. మతిస్థిమితం సరిగా లేని సావిత్రి తరచూ రహదారిపైకి వెళ్లి వచ్చేంది. ఈ క్రమంలో శనివారం రాత్రి రహదారిపైకి చేరుకున్న ఆమెను గుత్తి వైపు వెళుతున్న వాహనం ఢీకొంది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహ ఉడాయించాడు. ఘటనపై రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేశారు.

సచివాలయ ఉద్యోగి విధులకు డుమ్మా

- ఏడాదిగా గైర్హాజరు
- చర్యలకు వెనకాడుతున్న అధికారులు

తాడిపత్రి: అతడో సచివాలయ ప్రభుత్వ ఉద్యోగి. విధుల నిర్వహణలో భాగంగా సెలవు దినాల్లో మినహా ప్రతి రోజూ విధులకు హాజరై ఆయా సచివాలయ పరిధిలో ప్రజలకు సేవలు అందించాల్సిన బాధ్యత గల ఉద్యోగి. అయితే 10 నెలలుగా విధులకు గైర్హాజరవుతున్నా సదరు ఉద్యోగిపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. వివరాల్లోకెళితే... తాడిపత్రి మండలంబ్రాహ్మణపల్లి సచివాలయంలో జి. కేదార్‌నాథ్‌రెడ్డి వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అనారోగ్య సమస్యలతో 2021 నవంబర్ 29 నుంచి తాడిపత్రి ఎంపీడీఓకు మెడికల్‌లీవ్‌కు దరఖాస్తు చేసుకోగా ఆయన సెలవు మంజూరు చేశారు. అయితే సెలవులు ముగిసిన తర్వాత సదరు ఉద్యోగి 2022 మార్చి 2 నుంచి విధుల్లోకి రావాల్సి ఉంది. అయినా ఎలాంటి అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొట్టాడు. గతంలో ఎంపీడీఓ కార్యాలయ అధికారులు వెల్ఫేర్ శాఖ, అనంతపురం, తాడిపత్రి అధికారులకు సమాచారం అందించినా ఉద్యోగిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



సచివాలయంలో ఖాళీగా ఉన్న వెల్ఫేర్,ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కుర్చీ

చర్యలు తప్పవు

బ్రాహ్మణపల్లి సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, జి. కేదార్‌నాథ్ రెడ్డి విధులకు కొద్ది నెలలుగా గైర్హాజరై వస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై నివేదిక తయారు చేసి పంపాల్సిందిగా తాడిపత్రి ఎంపీడీఓతో పాటు తాడిపత్రి ఏఎస్‌డబ్ల్యూఓకు సమాచారం ఇచ్చాం. నివేదిక వచ్చిన వెంటనే అతడిని విధుల నుంచి తొలగిస్తాం. విధులకు అనధికారికంగా గైర్హాజరయ్యే వారి పట్ల శాఖాపరమైన చర్యలు తప్పవు.

- విశ్వమోహన్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ, అనంతపురం